## క్లుప్తంగా

### ప్రత్యేక అవసరాల విద్యార్థులను గుర్తించండి



పాఠ్యపుస్తకాలను పరిశీలిస్తున్న ఎంఈఓ, ఐఈడీ కోఆర్డినేటర్

చీమకుర్తి: మండలంలో ప్రత్యేక అవసరాలు కలిగిన విద్యార్థులను గుర్తించాలని ఎస్ఎస్ఏ ఐడీడీ కోఆర్డినేటర్ రమేష్ అన్నారు. సోమవారం చీమకుర్తి ఎంఆర్సీ కేంద్రాన్ని సందర్శించారు. దానితో పాటు జీఎల్‌పురంలో ప్రత్యేక అవసరాలు కలిగిన విద్యార్థుల ఇంటిని సందర్శించారు. ఈ సందర్భంగా ఎంఈఓ శివాజీతో కలిసి ఎంఆర్సీలో పాఠ్యపుస్తకాలను పరిశీలించారు. అనంతరం మాట్లాడుతూ ప్రత్యేక అవసరాలు కలిగిన విద్యార్థులను గుర్తించి భవిత కేంద్రాల్లో నమోదు చేసేలా చర్యలు తీసుకోవాలన్నారు. సీఆర్పీలు, ఎంఆర్సీ సిబ్బంది ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.

### ఎన్‌సీసీ శిక్షణకు క్విస్ పాఠశాల విద్యార్థులు




ఎన్‌సీసీ శిక్షణకు అర్హత పొందిన క్విస్ విద్యార్థులు

ఒంగోలు: ఎన్‌సీసీ శిక్షణకు స్థానిక క్విస్ పాఠశాల విద్యార్థులు 15 మంది అర్హత సాధించారు. వీరు 34వ బెటాలియన్ ఆధ్వర్యంలో శిక్షణ పొందుతారు. స్థానిక ఒంగోలులోని ట్రిపుల్ ఐటీ క్యాంపస్‌లో 10 రోజులపాటు శిక్షణ ఇవ్వనున్నారు. ఉదయం 9 గంటలకు శిక్షణ ప్రారంభమవుతుంది. ఎన్‌సీసీ శిక్షణలో అన్ని అంశాలపై సమగ్ర అవగాహన పెంచుకుని సర్వతోముఖాభివృద్ధి సాధించాలని ఈ సందర్భంగా విద్యార్థులకు క్విస్ పాఠశాల చైర్మన్ డాక్టర్ నిడమానూరి సూర్య కళ్యాణ చక్రవర్తి, వైస్ చైర్మన్ గాయత్రి, డీన్ నూతలపాటి కమలేశ్వరి, ఏవో సునీల్, ఉపాధ్యాయుని ఉపాధ్యాయ బృందం అభినందించారు.

### హరిహర క్షేత్రంలో శిద్దా పూజలు



హరిహరక్షేత్రంలో పూజలు చేస్తున్న మాజీ మంత్రి శిద్దా రాఘవరావు

చీమకుర్తి: మాజీ మంత్రి శిద్దా రాఘవరావు సోమవారం రాత్రి చీమకుర్తిలోని హరిహర క్షేత్రంలో పూజలు నిర్వహించారు. శివాలయంలో ప్రదోష పూజలు నిర్వహించి స్వామివారి ఆశీర్వాదాలను స్వీకరించారు.

### ముటుకులలో 20 బైక్‌లు సీజ్

పుల్లలచెరువు: మండలంలోని ముటుకులలో సీఐ రాములునాయక్ ఆధ్వర్యంలో కార్డన్ సెర్చ్ చేశారు. సరైన పత్రాలు సక్రమంగా లేని 20 బైక్‌లను స్వాధీనం చేసుకుని స్టేషన్‌కు తరలించారు. ఎన్నికల నేపథ్యంలో సమస్యాత్మక గ్రామాల్లో కార్డన్ సెర్చ్ నిర్వహిస్తున్నట్లు సీఐ తెలిపారు. ఆయన వెంట పుల్లలచెరువు ఎస్ఐ ఫిరోజ్‌ఫాతిమా, సిబ్బంది ఉన్నారు.

# త్యాగధనుడు ప్రకాశం పంతులు




ప్రకాశం పంతులు విగ్రహానికి నివాళులర్పిస్తున్న బ్రాహ్మణ పెద్దలు

ఒంగోలు టౌన్: దేశ స్వాతంత్య్రం కోసం తన యావదాస్తిని ఖర్చు చేసిన మహనీయుడు ప్రకాశం పంతులు మన జిల్లాలో పుట్టడం మనందరికీ గర్వకారణమని జిల్లా గ్రంథాలయ సంస్థ కార్యదర్శి కాసు ఆదిలక్ష్మి అన్నారు. నగరంలోని జిల్లా కేంద్ర గ్రంథాలయంలో సోమవారం ఆంధ్ర కేసరి ప్రకాశం పంతులు 67వ వర్ధంతిని నిర్వహించారు. ప్రకాశం పంతులు చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆదిలక్ష్మి మాట్లాడుతూ నిరుపేద కుటుంబంలో పుట్టి రాష్ట్రానికి తొలి ముఖ్యమంత్రి అయిన టంగుటూరి జీవితం స్ఫూర్తిదాయకమని కొనియాడారు. పట్టుదలతో బారిస్టర్ చదువుకొని న్యాయవాదిగా కీలకమైన కేసులు వాదించి విజయం సాధించారని తెలిపారు. ప్రకాశం పంతులు జీవిత చరిత్రను పాఠ్యాంశంగా చేర్చి నేటి తరానికి బోధించాలని కోరారు.

**కొనసాగుతున్న వేసవి శిక్షణ తరగతులు...**

జిల్లా గ్రంథాలయంలో జరుగుతున్న వేసవి శిక్షణ తరగతుల్లో భాగంగా జనవిజ్ఞాన వేదిక నాయకులు దాసరి లక్ష్మి ప్రసాద్ చిన్నారులకు పుల్లలతో భవనాన్ని నిర్మించడం నేర్పించారు. కవి జాలాది మోహన్ ఆంగ్ల అక్షరాలతో పదాలను కూర్చడం నేర్పించారు. జిల్లా కేంద్ర గ్రంథాలయం ఉప పాలకురాలు బొమ్మల కోటేశ్వరి ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో విశ్రాంత సబ్ కలెక్టర్ పేరయ్య, వెంకటేశ్వరరెడ్డి, సంపూర్ణమ్మ, ఇమ్మానియేలు, సీఎచ్ సుధాకరరావు, విశ్రాంత ప్రిన్సిపాల్ నరసింహం, పర్సనాలిటీ డెవలప్‌మెంట్ శిక్షకులు సాయిరాం, సీఐటీయూ నాయకులు చీకటి శ్రీనివాసరావు, కంప్యూటర్ సైన్స్ శిక్షకులు అశోక్ కుమార్, ఆంజనేయులు తదితరులు పాల్గొన్నారు.



ప్రకాశం పంతులు గురించి వివరిస్తున్న వక్తలు

**ఆంధ్రకేసరి ఆశయాలు కొనసాగిస్తాం**

ఒంగోలు మెట్రో: తెల్ల దొరలకు ఎదురొడ్డి నిలిచిన ధీరోదాత్తుడు, ఆంధ్ర కేసరి టంగుటూరి ప్రకాశం పంతులు అని వారి ఆశయాలు కొనసాగించాలని బ్రాహ్మణ పెద్దలు పిలుపునిచ్చారు. సోమవారం టంగుటూరి ప్రకాశం పంతులు 67 వ వర్ధంతి సందర్భంగా లాయర్ పేటలోని ఆంధ్రకేసరి విగ్రహానికి బ్రాహ్మణ సేవాసమితి, ఆంధ్రకేసరి సేవాసంఘం పెద్దలు నివాళులర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ నేటి యువత ఆంధ్ర కేసరి ఆశయాలు ఆకళింపు చేసుకొని ముందుకు నడవాలని సూచించారు. ఆంధ్ర రాష్ట్రానికి తొలి ముఖ్యమంత్రిగా ఆయన విశేష సేవలు అందించారని కొనియాడారు. తన దగ్గర ఉన్న ప్రతి రూపాయి పేదవానికి దానం చేసే వారని పేర్కొన్నారు. వారి దాన గుణం వెలకట్టలేనిదన్నారు. నేటి యువత ఆయన చరిత్రను బాగా అధ్యయనం చేయాలని సూచించారు. నివాళులర్పించిన వారిలో బ్రాహ్మణ పెద్దలు మహంకాళి శేషయ్య, మద్దులూరు హరి, మైనంపాటి సాయి కుమార్, పింగళి పూర్ణ చంద్రరావు, త్రోవగుంట చందు, ఉప్పుగుండూరి శ్రీనివాసరావు, గంజామ్ రంగనాథ్, గడియారం సుబయ్య శర్మ, అగస్త్యరాజు శివయ్య, నీలంరాజు రాఘవ, రాచకొండ శ్రీనివాస్ శాస్త్రి, కొండపి సుబ్బారావు, కార్పొరేటర్ ఆదిపూడి శాండిల్య, తదితరులు పాల్గొన్నారు.

# విద్యుత్ సమస్యలు పరిష్కరించాలి

- తాగునీరు ఇబ్బందులు లేకుండా చూస్తామన్న ఎంపీపీ



సర్వసభ్య సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీపీ వాకా అరుణ కోటిరెడ్డితో ఎంపీడీఓ శ్రీహరి

మద్దిపాడు: మండలంలో సామాన్య ప్రజలకు వేసవిలో అవసరమైన విద్యుత్, తాగునీరు సరఫరా చేసేలా చర్యలు తీసుకుంటామని ఎంపీపీ వాకా అరుణ కోటిరెడ్డి అన్నారు. మండల పరిషత్ సమావేశ మందిరంలో సోమవారం ఏర్పాటు చేసిన మండల సర్వసభ్య సమావేశంలో ఆమె మాట్లాడారు. ఎన్నికల కోడ్ ఉన్న నేపథ్యంలో సమావేశం వేసవికి సంబంధించి తాగునీటి సమస్యలు, విద్యుత్ సమస్యలు ఏమైనా ఉంటే తమకు తెలపాలని సభ్యులను కోరారు. ఈక్రమంలో సభ్యులు గ్రామాల్లో విద్యుత్ సమస్యలు ఉన్నాయని, వాటిని పరిష్కరించాలని కోరగా విద్యుత్ శాఖ ఏఈ చెన్నారెడ్డి మాట్లాడుతూ ప్రస్తుతం మండలంలో 24 గంటలు విద్యుత్ సేవలు అందించడానికి కొత్త లైన్‌లు వేస్తున్నామని చెప్పారు. దీనివల్ల విద్యుత్ సరఫరాలో కొద్దిగా అంతరాయం కలుగుతుందని, వినియోగదారులకు అసౌకర్యం కలిగించకుండా పనులు పూర్తి చేయడానికి ప్రయత్నిస్తున్నామన్నారు. గతంలో ఒకే ఫీడర్‌పై 12 గ్రామాలకు, వ్యవసాయానికి కనెక్షన్‌లు ఉండేవని ప్రస్తుతం వ్యవసాయానికి ప్రత్యేకంగా ఫీడర్‌లు ఏర్పాటు చేస్తున్నామని ఫీడర్లు ఎక్కువగా ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. ఇటీవల కురిసిన వర్షాలకు పొలాల్లో అక్కడక్కడా విద్యుత్ స్తంభాలు ఒరిగిపోయాయని వాటిని కూడా సరి చేస్తున్నట్లు తెలిపారు. అనంతరం ఎంపీపీ మాట్లాడుతూ మండలంలో సమస్యలు ఏవైనా ఉంటే తనకు తెలియజేయాలని అధికారులతో మాట్లాడి సమస్యలను పరిష్కరిస్తామని ఆమె సభ్యులకు తెలిపారు. కార్యక్రమంలో ఆమె వెంట ఎంపీడీఓ శ్రీహరి, ఎంపీటీసీ సభ్యులు, సర్పంచ్‌లు మండల స్థాయి అధికారులు, గ్రామ కార్యదర్శులు పాల్గొన్నారు.

# క్రీడలతో యువతలో ఉత్తేజం



చేకూరపాడులో క్రీడాకారులకు బహుమతులిస్తున్న రాజేష్

నాగులుప్పలపాడు: క్రీడల వలన యువతలో ఐక్యతతో పాటు నూతనోత్సాహం ఏర్పడుతుందని జేపీఎఫ్ జిల్లా కన్వీనర్ పాలడుగు రాజు అన్నారు. సోమవారం చేకూరపాడు గ్రామంలో జైభీమ్ ఆధ్వర్యంలో నిర్వహించిన జిల్లా స్థాయి క్రికెట్ పోటీల్లో గెలుపొందిన నందిపాడు, మంగమూరు జట్లకు బహుమతులు అందజేశారు. ఉప్పుగుండూరు విద్యానగర్ యూత్ ఫోర్స్ ఆధ్వర్యంలో ప్రారంభించిన క్రికెట్ పోటీలను వైఎస్సార్ సీపీ నాయకులు మద్దిసాని నాగేశ్వరరావు ప్రారంభించి క్రీడాకారులను పరిచయం చేసుకున్నారు. చప్పిడి ప్రసాద్, శేషయ్య, ఆలీబాబా, వెంకట్రావు పాల్గొన్నారు.



క్రీడాకారులను పరిచయం చేసుకుంటున్న పార్టీ నాయకులు

# గ్రామాల్లో కార్డన్ సెర్చ్

- ఆధారాలు లేని వాహనాలు సీజ్
- గ్రామాల్లో పోలీసుల పల్లెనిద్ర

చీమకుర్తి: సీఐ దుర్గా ప్రసాద్ ఆధ్వర్యంలో చీమకుర్తి పోలీసులు సోమవారం చీమకుర్తి మండలం పాటిమీదపాలెంలో కార్డన్ సెర్చ్ నిర్వహించారు. ఎన్నికల లెక్కింపు ముందస్తు జాగ్రత్తలో భాగంగా ఈ కార్యక్రమాన్ని నిర్వహించినట్లు తెలిపారు. ఈ సందర్భంగా పాటిమీదపాలెంలోని ప్రతి ఇంటితో పాటు గోడౌన్‌లు, అనుమానాస్పద ప్రాంతాల్లో పోలీసు సిబ్బంది పూర్తిగా గాలించారు. కొట్లాటలకు, విధ్వంసాలకు ఉపయోగించే కర్రలు, బాంబులు, ఇతర మారణాయుధాలతో పాటు ఎలాంటి రిజిస్ట్రేషన్‌లు, డ్రైవింగ్ లైసెన్స్ లేని వాహనాలను తనిఖీ చేశారు. ఎలాంటి ఆధారాలు లేని 10 వాహనాలు సీజ్ చేశారు. ఈ రోజు ఎన్నికల లెక్కింపు పూర్తయ్యే వరకు గ్రామాల్లో కార్డన్ సెర్చ్‌తో పాటు రాత్రి పూట పల్లె నిద్ర కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు సీఐ దుర్గా ప్రసాద్ తెలిపారు. సీజ్ చేసిన వాహనాలను మోటర్ వెహికల్ ఇన్‌స్పెక్టర్ పర్యవేక్షణ నిమిత్తం పంపిస్తున్నట్లు సీఐ తెలిపారు.





పాటిమీదపాలెంలో కార్డన్ సెర్చ్ నిర్వహిస్తున్న సీఐ దుర్గాప్రసాద్, వారి సిబ్బంది

**19 వాహనాలు సీజ్**

నాగులుప్పలపాడు: కార్డన్ సెర్చ్‌లో భాగంగా సోమవారం మండల వ్యాప్తంగా నిర్వహించిన కార్డన్ సెర్చ్‌లో వివిధ ప్రాంతాల నుంచి గుర్తింపు పత్రాలు లేని 19 మోటర్ సైకిళ్లు, ఒక ఆటోను సీజ్ చేసినట్లు ఎస్సై బ్రహ్మనాయుడు తెలిపారు.



పట్టుబడిన వాహనాలతో ఎస్సై, సిబ్బంది

# చంద్రశేఖరేంద్ర సరస్వతి జయంతి వేడుకలు



చండీ సప్తపది హోమంలో పాల్గొన్న దంపతులు



పూర్ణాహుతి కార్యక్రమంలో పాల్గొన్న మహిళలు

ఒంగోలు మెట్రో: కంచి పరమాచార్య ధార్మిక సేవా సమితి ఆధ్వర్యంలో సోమవారం ఉదయం స్థానిక రంగారాయుడు చెరువు దగ్గర ధీరజ్ హాస్పిటల్ ఎదురుగా చంద్రశేఖరేంద్ర సరస్వతి స్వామివారి 131వ జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు. ప్రముఖ వేద పురోహితుల ఆధ్వర్యంలో ఉదయం ఐదు గంటలకు మంగళ వాయిద్యాలు, మహాగణపతి పూజ, గోపూజ నిర్వహించారు. అనంతరం ఉదయం తొమ్మిది గంటలకు కంచి పరమాచార్య చంద్రశేఖరేంద్ర సరస్వతి మహాస్వామి వారి పంచలోహ విగ్రహానికి మహాన్యాస పూర్వక ఏకాదశ రుద్రాభిషేకాలు నిర్వహించారు. ఉదయం పది గంటలకు లక్ష్మీ గణపతి హోమం, రుద్ర హోమం, చండీ సప్తపది హోమాలు వైభవంగా నిర్వహించారు. మధ్యాహ్నం పన్నెండు గంటలకు పూర్ణాహుతి, విశేష హారతులు నిర్వహించారు. కార్యక్రమాల్లో స్థానిక భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని స్వామి వారి తీర్థ ప్రసాదాలను సేకరించి అన్నసంతర్పణలో పాల్గొన్నారు.

# అంతర్ పంటలతో రక్షణ

- ఏఓ మోహన్‌రెడ్డి



అంతర్ పంటలకు ఉచితంగా విత్తనాలు పంపిణీ చేస్తున్న ఏవో మోహన్‌రెడ్డి, వెంకటేశ్వర్‌రెడ్డి

కొత్తపట్నం: పంట పైర్ల వెంబడి అంతర్ పంటలు నాటుకుంటే పంటలకు రక్షణతో పాటు తెగుళ్ల, చీడపీడల నుంచి రక్షణలా కాపాడుతాయని మండల వ్యవసాయాధికారి మోహన్‌రెడ్డి అన్నారు. రైతు సాధికార సంస్థ ఆంధ్రప్రదేశ్ కమ్యూనిటీ నేచురల్ ఫార్మింగ్ ఆధ్వర్యంలో సోమవారం వేరుశనగ పంటల్లో అంతర్ పంటల గురించి రైతులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఏవో మాట్లాడుతూ ప్రస్తుత సీజన్‌లో వేరుశనగ పంటలు సాగు చేస్తున్నందున అంతర్ పంటలుగా జొన్న, మొక్కజొన్న, సజ్జ, బెండ, గోరుచిక్కుడు, అలసంద, పొద్దుతిరుగుడు విత్తనాలు వేసుకోవాలని సూచించారు. సాగు చేసే పంటలకు అంతర్ పంటలు తప్పనిసరిగా వేసుకుంటే పైరుగా రక్షణలాగా కాపాడుతాయన్నారు. అంతర్ పంటలు వేసుకున్నట్లెతై పంటలో జీవ వైవిధ్యం జరగటంతో పాటు భూసారం పెరుగుతుందన్నారు. వీటి వల్ల పైరు ఆరోగ్యంగా ఉంటూ దిగుబడులు అధికంగా వస్తాయని చెప్పారు. అంతేకాకుండా అధికంగా ఆదాయం చూడవచ్చన్నారు. పంట వేసేటప్పుడు విత్తన శుద్ధి బీజామృతంతో చేసుకోవాలని సూచించారు. ప్రకృతి వ్యవసాయ పద్ధతుల్లో కషాయాలు, ద్రావణాల ద్వారా అన్ని రకాల పురుగులు, తెగుళ్లు నివారించవచ్చని వివరించారు. ప్రకృతి వ్యవసాయం వలన తక్కువ ఖర్చుతో అధిక ఆదాయం పొందవచ్చని తెలిపారు. ప్రతి ఒక్కరూ రసాయన ఎరువుల వాడకం తగ్గించి సేంద్రియ ఎరువులను వాడుకోవాలని సూచించారు. అనంతరం అంతర్ పంటలుగా వేసుకోవడానికి జొన్న, మొక్కజొన్న, సజ్జ, బెండ, గోరుచిక్కుడు, అలసంద, పొద్దుతిరుగుడు విత్తనాలను ఉచితంగా పంపిణీ చేశారు. కార్యక్రమంలో విలేజ్ అగ్రికల్చర్ అసిస్టెంట్ కరిముల్లా, ప్రకృతి వ్యవసాయ సిబ్బంది వికాస్ రెడ్డి, నరసింహులు, పిట్టు వెంకటేశ్వర్‌రెడ్డి, మనోహర్, రెహమాన్ బాషా, కాసింబి, రైతులు హాజరయ్యారు.

# పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం



అధ్యాపకులకు సన్మానిస్తున్న పూర్వవిద్యార్థులు

గిద్దలూరు రూరల్: శ్రీవివేకానంద కళాశాలలో 1995–98 సంవత్సరాల మధ్య డిగ్రీ చదువుకున్న పూర్వ విద్యార్థులు సోమవారం పట్టణంలోని అభిలాష ఫంక్షన్ హాల్‌లో ఆత్మీయ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా పూర్వ విద్యార్థులకు విద్యాబోధన చేసిన అధ్యాపకుడు, జనవిజ్ఞాన వేదిక నాయకుడు పి.స్వరూపారెడ్డి మాట్లాడుతూ 25 సంవత్సరాల తర్వాత పూర్వ విద్యార్థులంతా ఒకే చోట కలవడం ఎంతో ఆనందంగా ఉందన్నారు. అప్పటి జ్ఞాపకాలతో విద్యార్థులు ఒకరినొకరు ఆప్యాయంగా గుర్తుచేసుకుంటూ ఆనందంగా గడిపారు. ఈ సందర్భంగా పూర్వ విద్యార్థులు వారికి విద్యను బోధించిన అధ్యాపకులైన రాఘవరావు, బాలిరెడ్డి, భాస్కర్ రావులను ఘనంగా సన్మానించారు. పూర్వ విద్యార్థులు మధు, ప్రసాద్, పాండు, నాగమణి, సాయిలక్ష్మి, రంగేశ్వరి, సత్యనారాయణ పాల్గొన్నారు.

# వైభవంగా లక్ష్మీచెన్నకేశవ స్వామి కళ్యాణం



లక్ష్మీ చెన్నకేశవస్వామి కళ్యాణం నిర్వహిస్తున్న అర్చకులు

హనుమంతునిపాడు: మండల పరిధిలోని నల్లగండ్ల పంచాయతీ చిన్నగొల్లపల్లి గ్రామం నాగులేటి ఒడ్డున కొలువైన శ్రీలక్ష్మీ చెన్నకేశ్వ స్వామి కళ్యాణ మహోత్సవం సోమవారం వైభంగా నిర్వహించారు. ఉభయదాతలుగా గాయంవారిపల్లి, గుంటూరుకు చెందిన చెక్కా కుటుంబీకులు వ్యవహరించారు. స్వామి వారికి పట్టు వస్త్రాలు సమర్పించారు. కార్యక్రమంలో భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని మొక్కులు చెల్లించారు.

# పొగాకు అక్రమ విక్రయం సరికాదు



వేలాన్ని పర్యవేక్షిస్తున్న నిర్వహణాధికారి శ్రీనివాసరావు

టంగుటూరు: పొగాకు బేళ్లను అక్రమంగా కొనుగోలు చేసినా, విక్రయించినా చట్టపరమైన చర్యలు తీసుకుంటామని వేలం నిర్వహణాధికారి శ్రీనివాసరావు హెచ్చరించారు. సోమవారం కె.ఉప్పలపాడు క్లస్టరు గ్రామాల రైతులు 395 బేళ్లను వేలానికి తీసుకురాగా వాటిలో 384 కొనుగోలయ్యాయి. 11 బేళ్లను వ్యాపారులు తిరస్కరించారు. గరిష్ఠ ధర కేజీ రూ.306, కనిష్ఠ ధర రూ.205, సరాసరి ధర రూ.251.61 పలికింది. వేలంలో మొత్తం 37 మంది వ్యాపారులు పాల్గొన్నారని నిర్వహణాధికారి తెలిపారు.

## విద్యుదాఘాతానికి రెండు గేదెలు మృతి



గేదెల కళేబరాలు

తాళ్లూరు (ముండ్లమూరు): మండలంలోని కొర్రపాటివారి పాలెంలో కోటా పెదశేషయ్యకి చెందిన రెండు గేదెలు విద్యుత్ షాక్‌కి గురై మృతి చెందాయని బాధిత రైతు ఆవేదన వ్యక్తం చేశాడు. గ్రామానికి చెందిన కోటా పెద శేషయ్య పశువులను మేపుకునేందుకు సోమవారం ఉదయం పొలం వెళ్లాడు. సాయంత్రం వేళలో ఇంటికి వచ్చే సమయంలో పొలంలో విద్యుత్ తీగలు కిందకు వేలాడుతుండటంతో గేదెలకు తీగలు తగిలాయి. ప్రమాదంలో రెండు గేదెలు అక్కడికక్కడే మృతి చెందాయి. వాటి విలువ సుమారు రూ.మూడు లక్షలు ఉంటుందని బాధిత రైతు తెలిపారు. గేదెలకు విత్యుత్ షాక్ తగిలిన సమయంలో తాను కొద్దిపాటి షాక్‌కి గురయ్యానని ఆందోళన వ్యక్తం చేశాడు. కొంచెం తేరుకొని వెంటనే కుటుంబ సభ్యులకు సమాచారం ఇవ్వడంతో వారు తన దగ్గరకు వచ్చారన్నారు. ఇదిలా ఉంటే గత నెల రోజుల నుంచి విద్యుత్ వైర్లు కిందకు వేలాడుతున్నాయని సంబంధిత అధికారులకు సమాచారం ఇచ్చినా పట్టించుకోక పోవడంతో నేడు గేదెలు మృత్యువాత పడ్డాయని గ్రామస్తులు విద్యుత్ సిబ్బంది తీరుపై ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

## మద్యం బాటిళ్లు స్వాధీనం

గిద్దలూరు రూరల్: ఓ వ్యక్తి బైక్‌పై అక్రమంగా తరలిస్తున్న మద్యం బాటిళ్లను స్థానిక సెబ్ సీఐ కొండారెడ్డి ఆధ్వర్యంలో సెబ్ అధికారులు సోమవారం కనుగొని అతడిని అదుపులోకి తీసుకున్నారు. రాచర్లకు చెందిన కోటేశ్వరరావు అనే వ్యక్తి 13 ఆర్మీ మద్యం బాటిళ్లను ఎటువంటి రసీదులు లేకుండా అక్రమంగా తరలిస్తుండగా పట్టణంలోని రాచర్ల గేటు సమీపంలో అదుపులోకి తీసుకుని అతడి పై కేసు నమోదు చేసినట్లు సీఐ తెలిపారు. మద్యం బాటిళ్లతో పాటు అతడి బైక్‌ను సీజ్ చేసినట్లు పేర్కొన్నారు. అక్రమంగా మద్యం బాటిళ్లు తరలిస్తున్న వారిపై ప్రత్యేక నిఘా ఉంచామని, అలాంటి వారిని ఉపేక్షించే ప్రసక్తే లేదన్నారు.

## బాధ్యతలు స్వీకరించిన ఏపీజీబీ ఆర్ఎం

మార్కాపురం: ఆంధ్రప్రగతి గ్రామీణ బ్యాంక్ రీజినల్ మేనేజర్‌గా ఎం.రఘురాం సోమవారం మార్కాపురంలోని తన కార్యాలయంలో బాధ్యతలు స్వీకరించారు. ఈయన కడప కేంద్ర కార్యాలయం నుంచి బదిలీపై మార్కాపురంలో నియమితులయ్యారు. ఇప్పటి వరకు ఇక్కడ పనిచేసిన శ్రీనివాసప్రసాద్ కడప ఆర్ఎంగా బదిలీపై వెళ్లారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఏపీజీబీ ఖాతాదారులకు మెరుగైన సేవలు అందించేందుకు తమ సిబ్బంది కృషి చేస్తారన్నారు. ఈ సందర్భంగా ఆయనకు సిబ్బంది ఘన స్వాగతం పలికారు.

## రాయితీపై పచ్చిరొట్ట విత్తనాలు



మాట్లాడుతున్న ఏఓ వెంకటస్వామి

పీసీపల్లి: రాయితీపై పంపిణీ చేసేందుకు పచ్చి రొట్ట విత్తనాలు సిద్ధంగా ఉన్నట్లు మండల వ్యవసాయాధికారి జి.వెంకటస్వామి తెలిపారు. సోమవారం స్థానిక వ్యవసాయ కార్యాలయంలో ఆర్బీకేల సిబ్బందితో నిర్వహించిన సమీక్షలో ఏఓ మాట్లాడారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. 50 శాతం రాయితీపై పంపిణీ చేసేందుకు ఆర్బీకేల్లో 37 క్వింటాళ్ల జనుములు, జీలుగ, పిల్లి పెసర విత్తనాలు సిద్ధంగా ఉన్నాయని వివరించారు. 2024–25 ఖరీఫ్‌కు సంబంధించి పచ్చిరొట్ట పైర్ల విత్తనాలు పంపిణీ చేస్తున్నట్లు తెలిపారు. అలాగే 2023–24 రబీ లో కరువుతో పంట నష్టపోయిన రైతుల జాబితాను ఈ నెల 25లోగా తహసీల్దార్‌కు అందజేయాలని సూచించారు.